# రుక్మిణీ కల్యాణము

సేకరణ : పి.ఎల్. నరసింహాచార్య దాసన్

## ముందు మాట

భాగవతములో కొన్ని ఘట్టాలు మనను చాలా ఉత్తేజపరుస్తాయి. అవే ప్రహ్లాద చరిత్ర ~ వామన చరిత్ర ~ గజేంద్ర మోక్షణము ~ అంబరీష చరిత్ర~ ధ్రువ చరిత్ర ~ శ్రీరామ చరిత్ర ~ శ్రీకృష్ణుని చిన్ననాటి చిలిపి చేష్టలు ~ రుక్మిణీ కల్యాణము ~ సత్యభామ తులాభార ఘట్టము ~ మనము మరీ మరీ చదివి తన్మయులమైపోతాము. అందులో పోతనామాత్యుని పద్యకుసుమాలు మరీనూ.

ఇప్పుడు రుక్మిణీ కల్యాణ ఘట్టములోని కొన్ని పద్యాలను కాస్తంత నెమరు వేసుకుందామా? మన చిన్ననాడు మనమందరూ చదివినవే కదా!

**క: భూషణములు సెవులకు బుధ**
**తోషణమిలనేక జన్మ దురితౌఘు విని**
**శ్శోషణములు మంగళ తర**
**ఘోషణములు గరుడ గమను గుణభాషణముల్**

రుక్మిణీ కల్యాణ ఘట్టానికి తిలకము లాంటిి పద్యమిది. ఈ తిలకాన్ని దిద్దుకున్నాకనే కథా కల్యాణి కదలాడుతుంది. గరుడ గమనుని గుణగణ కీర్తనలు ఎంత విలువైనవో తెలుపుతుందీ పద్యము. అవి

కర్ణభూషణము లట! పండితులను అలరించే వట! అనేక జన్మల పాపాలను  తొలగించే వట! కల్యాణ ప్రదములైన నినాదము లట!

ఇందులో అర్థము కంటే శబ్దము ~ శబ్దము కంటే అది పలికించే నాదమే ముఖ్యమైనది. లాక్షణిక దృష్టికి భూషణములు తోషణములు ఇత్యాది ప్రాసస్థానాలు త్రిప్రాసం క్రిందికో, చతుష్ప్రాసం కిందికో వస్తాయి. కానీ ఒక రకముగా వాక్యము చివర అంత్యప్రాస స్థానములో ఉన్నా అంత్యప్రాసల దరువుల్లాగా శ్రవణ సుఖాన్ని కూర్చే కూర్పులివి. వాసుదేవుని గుణ భాషణములు వర్ణించాలని మనస్సు చెప్పింది. ఇంకేమి? భాషణములు అనే మాటకు సరితూగే పదాలు ప్రాసస్థానములో తమంత తామే వచ్చి కుదురుకున్నవి ~ భూషణములు ~ తోషణములు ~ శోషణములు ~ ఘోషణములు అంటూ!

విదర్భ దేశమున కుండినపుర ప్రభువైన భీష్మకుడు అను ఒక దొడ్డరాజు ఉండేవాడు. ఆయనకు ఐదుగురు పుత్రులు ~ రుక్మి ~ రుక్మరథ ~ రుక్మబాహు ~ రుక్మకేశ ~ రుక్మమాలి. ఈ ఐదుగురికినీ ఒక ప్రియమైన చెల్లెలు రుక్మిణీ కన్య. ఆమె తన తండ్రి గృహానికి వచ్చుచుండు అథితిజనుల వల్ల శ్రీకృష్ణుని రూప ~ యౌవన ~ బల ~ గుణాదుల గురించి వినుచుండుటచే, శ్రీకృష్ణుడే  తనకు తగిన విభుడు అని నిశ్చయించుకుంది.

అక్కడ ద్వారకలో శ్రీకృష్ణుడు రుక్మిణీ రూప ~ బుద్ధి ~ శీలము ~ లక్షణము ~ గుణముల గురించి విని ఆలోచించుచూ, ఆ కన్యారత్నమే తనకు తగిన ఇల్లాలని తలంచి ఆమెనే పొందవలెనని నిశ్చయించుకున్నాడు.

బంధువులందరునూ శ్రీకృష్ణుడే రుక్మిణి నిచ్చుట యుక్తమని బాగా ఆలోచించి చెప్పుచుండగా ~ దుష్టబుద్ధి అగు రుక్మి శ్రీకృష్ణునియందు మిక్కిలి శత్రుత్వము కలవాడై తన చెల్లెలిని తన మిత్రుడైన శిశుపాలునికే ఇవ్వాలని ద్వేషాంధుడై పట్టు పట్టి ఉన్నాడు.

**చ: వినుము విదర్భదేశమున వీరుడు కుండిన భర్త భీష్మకుం***
**డను నొక దొడ్డరాజు గలడాతని కేవురు పుత్రులగ్రజుం***
**డనయుడు రుక్మినా బరగు నందరకుం గడగొట్టు చెల్లెలై***
**మనుజవరేణ్య! పుట్టె నొక మానిని రుక్మిణినా బ్రసిద్ధయై***

**క: బాలేందురేఖ తోచిన, లాలితయగు నపర దిక్కులాగున ధరణీ**
**పాలునిగేహము మెరసెను, బాలిక జన్మించి యెదుగ భాసురమగుచుస్***

**సీ: పేర్వేర బొమ్మల పెండిండ్లు సేయుచు నబలలతోడ వియ్యంబు లందు**
**గుజ్జనగూళ్ళను గొమరొప్ప వండించి చెలులకు బెట్టించు జెలువు మెరసి**
**రమణీయ మందిరా రామ దేశంబుల బువ్వు దీగెలకును బ్రోదిపెట్టు***
**సదమల మణిమయ సౌధభాగంబుల లీలతో భర్మడోలికలనూగు***

**తే: బాలికలతోడ జెలరేగి బంతులాడు**

**శారికాకీర పంక్తికి జదువు సెప్పు***

**బర్హి సంఘములకు మురిపెములు గరపు,**

**మద మరాళంబులకు జూపు***

**మందగతులు***

దినదిన ప్రవర్ధమాన యగుచు ఆ రుక్మిణి వధూవరుల పేర్లతో బొమ్మల పెండిండ్లు చేస్తూ తోడి బాలికలతో వియ్యములను నెరపుచుండెను. గుజ్జనగూళ్ళను వండించి తన తోడివారికి పంచుచుండెను. పూదీగలకు పందిళ్ళనమర్చి వాటిని పోషిస్తూ, మణిమయ భవనాలలో బంగారు తూగుటుయ్యాలలో హాయిగా ఊగుచూ ~ బంతులాడుచూ ~ గోరువంకలకు~ చిలుకలకు మాటలను నేర్పుచూ ~ నెమళ్ళ గుంపులతో ముద్దు మురిపెములు సాగించుచూ ~ రాజహంసలకు నడకల ఒయ్యారములను నేర్పుతూ ఉండెను.

క: తన తండ్రి గేహమునకు జనుదెంచుచునున్న యతిథిజనులవలన గృ
ష్ణుని రూప బల గుణాదులు విని కృష్ణుండు తనకు దగినవ్విభుడని
తలచెన్

క: ఆ లలన రూపు బుద్ధియు శీలము లక్షణము గుణము జింతించి తగన్

బాలారత్నము దనకి ల్లాలుగ జేసుకొందుననుచు హరియుం దలచెన్

శ్రీకృష్ణ పరమాత్ముడే తనకు తగిన భర్త అని రుక్మిణి అనుకుంటూ ఉంటే, అక్కడ శ్రీకృష్ణుడు ఆ బాలారత్నమే తనకి తగిన భార్య అని భావించెను.

**ఉ: బంధువులెల్ల గృష్ణునకు బాలికనిచ్చెదమంచు శేముషే**
**సింధువులై విచారములు సేయగ వారల నడ్డు పెట్టి దు**
**స్సంధుడు రుక్మి కృష్ణునెడ జాల విరోధము జేసి ముత్తపు**
**ష్పంధయ వేణి నిత్తు శిశుపాలునకంచు దలంచెనంధుడై**

అందరికీ అడ్డుపుల్లగా తయారైనాడు రుక్మిణి అన్నయ్య రుక్మి. ఆమెను శిశుపాలునికిచ్చి కట్టబెట్టాలనే పన్నాగములో ఉన్నాడు ~ అతడు అంధుడూ దుస్సంధుడూ కాబట్టి. ఈ అంధత్వము కంటికి సంబంధించినది కాదు; మతికి సంబంధించినది. అతని మతిని చీకటి ఆవరించింది ~ తామసము ప్రకోపించింది ~ తమోగుణ భూయిష్టునికి బుద్ధిమంతుల విచారాలు తలక్రిందులుగా కనిపిస్తాయి ~ అందుకే వాడు దుస్సంధుడయినాడు.

"సంధ" అంటే సమ్యోగము ~ రుక్మిణీ కృష్ణుల సమ్యోగము ~ లక్ష్మీనారాయణుల సమ్యోగము ~ ఇది సుసంధ. రుక్మిణిని శిశుపాలునికి

కూర్చాలనే దృక్పథము దుస్సంధ ~ ఇది అయోగ్యము ~ తామసాంధుడైన రుక్మి దుస్సంధుడుగాక మరేమవుతాడు?

మూల భాగవతములో "అంధుడై" అనే మాటకు బదులు "కృష్ణద్వేషి" అని ఉంది. కృష్ణద్వేషి అంటే ఆ ప్రత్యేక వ్యక్తి ని దూషిస్తున్నవాడు. తెలుగులో "అంధుడై" అనడము వల్ల రుక్మి సహజ ధూర్త ప్రకృతి బయటపడింది. "శేముషీ సింధువు" లనే మాటకూడా పోతనామాత్యుడి చేర్పే. "విచారములు సేయగా" అనేది ఈ నాటికీ ఆ అర్థములో వాడుకలో ఉన్న పలుకుబడి.

**ఉ: అన్న తలంపు దానెరిగి యన్నవ నీరజగంధి లోన నా**
**పన్నతనొంది యాప్తుడగు బ్రాహ్మణునొక్కంని జీరి గర్వసం**
**చన్నుడు రుక్మి నేడు నను జైద్యున కిచ్చెద నంచు చున్నవా**
**డెన్ని విధంబులంజని బుధేశ్వర చక్రికి విన్నవింపవే**

**క: అయ్యా కొడుకు విచారము, లయ్యము వారింప జాలడటు గాకుండస్**
**నెయ్యమెరిగించి చీరుము, చయ్యన నిజ సేవకానుసారిస్ శౌరిస్**

అన్న తలంపును చూచాయగా గ్రహించి రుక్మిణి లోలోన ఎంతో ఖేదపడింది.

ఆమె తన హితాన్ని కోరే "అగ్నిద్యోతనుడు" అను ఒక బ్రాహ్మణుని పిలిపించి ~ గర్వాంధ్గుడైన నా అన్న నన్ను శిశుపాలునకిచ్చి వివాహాన్ని చేయుటకై ఆరాటపడుతున్నాడు ~ మీరు త్వరగా ద్వారకకు వెళ్ళి ఆ చక్రధారికి నా పరిస్థితిని విన్నవించి మా తండ్రిగారు అన్నగారి మాటలను త్రోసిపుచ్చలేకున్నాడు కనుక నా ప్రణయమును ఆ స్వామివారికి తెలిపి త్వరగా ఇక్కడికి పిలుచుకుని రండి అని ఆ విప్రుని పదాలొత్తుతూ మృదువుగా విన్నవించింది.

రుక్మిణి పంపిన విప్రోత్తముడు అగ్నిద్యోతనుడు ద్వారకకు వెళ్ళి కృష్ణుడిని కలసినపుడు, కృష్ణుడు అతడికి సకల మర్యాదలను చేసి ఇలా ప్రశ్నించినాడు:

**ఉ: ఎవ్వని దేశమందునికి యెవ్వనిచే గుశలంబు గల్గు మీ**
**కెవ్వని రాజ్యమందు ప్రజలెల్ల సుఖింతురు వాడు మత్ప్రియుం**
**డువ్వన రాశు దుర్గమున కెట్లరుదెంచితివయ్య నీవు లే**
**నవ్వులు గావు నీ తలపునంగల మేలొనరింతు ధీమణీ**

ప్రజ్ఞానిధీ! నీవు ఏ దేశమునందు ఉందువు? దానికి ప్రభువు ఎవరు? మీ యోగక్షేమములను చూచెడివారెవరు? అయ్యా! సముద్రమునకు నడుమగల ఈ కోటలోకెట్లు రాగలివితివి? నీ వాంచలను చెప్పండి తప్పక తీరుస్తాను. అని కృష్ణుడు అడిగినాడు. ఆ విప్పుడు రుక్మిణి పంపిన సందేశాన్ని ఇవ్వగా....

సీ: ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోకబ్దేహతాపంబు దీరిపోవు
నే నీ శుభాకారమీక్షింప గన్నులకఖిలార్థ లాభంబు కలుగుచుండు
నే నీ చరణసేవలే ప్రొద్దుజేసిన భువనోన్నతత్వంబు బొందగలుగు
నే నీల సన్నామమే ప్రొద్దు భక్తితో దడవిన బంధసంతతులు వాయు

తే: నట్టి నీయందు నా చిత్త మనవరతము నచ్చి యున్నది నీ యాన నానలేదు
కరుణ జాడుము కంసారి ఖలవిదారి, శ్రీయుతాకార మానినీచిత్తచోర

అని ...ఓ కంసాంతకా! నీ సుగుణప్రశంసలు చెవులసోకినంతనే దేహ తాపములు తొలగిపోవును. దుష్టసంహారకా! చూడముచ్చటగొలిపెడు నీ ఆకారమును గాంచినంతనే కన్నుల కరవు తీరిపోవును. ఎల్లప్పుడును నీ చరణములను సేవించెడివారికి సకల ఔన్నత్యములు ప్రాప్తించును. తరుణీమనస్సులను దోచుకొనెడి స్వామీ! నిరంతరమూ నీ పవిత్ర నామమును భక్తితో స్మరించువారికి వివిధ బంధములునూ అంతరించును. అట్టి మహాత్ముడైన నీయందు నా మనస్సులగ్నమై  ఉంది. బిడియము వీడి ప్రమాణపూర్వకముగా తెలులుచున్న మట  ఇది అని రుక్మిణి సందేశాన్ని వినిపించినాడు విప్రుడు.

వ్యాఖ్య

రుక్మిణి పంపిన పరిణయ సందేశములోని ప్రథమ పద్యమిది. కృష్ణుడు ఆ బాలామణి దృష్టికి కేవలము కంసారి ~ ఖలవిదారి మాత్రమే కాదు ~ శ్రీయుతాకారుడు ~ మానినీ చిత్తచోరుడు కూడా. తాను మానిని ~ తన చిత్తమును ఏనాడో దొంగిలించినాడు ఆ శ్రీధరుడు. అతడు కేవలం గోపాలుడు కాదు, శ్రీపాలుడు. కన్నెగా ఉన్న రుక్మిణి జన్మాంతర సంస్కారమువల్ల కైముత్యములా భాసించిన సత్యమిది. అందుకే ఈ సంభోధనలను అంత బరువుగా ప్రయోగించింది. తన శరీరములోని సర్వేంద్రియాలు సమస్తాణువులు అతని పొందుకొరకు తహతహలాడుతున్నాయన చాటులేని మాటలలో తేటపరిచింది. "నీ యాన నానలేదు" అని అన్నదు. నీయాన అంటే నీతోడు సుమా! నాన అంటే సిగ్గు ~ కన్యాసహజమైన సిగ్గునుకూడా విడిచి కేలొగ్గి అడిగింది తనను కరుణించమని, అతని రూపాన్ని చూస్తే కన్నులపండుగట! అతని చరణాలను సేవిస్తే భవబంధాలు తొలగిపోతాయట! ఎవరీతడు? ప్రియుడేనా? కాదు విశ్వమయుడు ~ తనకు కాబోయే వరుడేనా? కాదు విశ్వేశ్వరుడు. నవవిధభక్తుల్లో నాలుగు భక్తిమార్గాలను ఈ పద్యములో పొందుపరచినాడు పోతనామాత్యుడు. మొదటిపాదములో శ్రవణం, రెండవపాదములో దర్శనం, మూడవపాదములో పాదసేవనం, నాలుగ పాదములో కీర్తనం. మొదటివి రెండూ వ్యాస భాగవత మూలములోవే.

తరువాతవి రెండు పోతన చేర్చినవి. నాలుగు పాదాలలో నాలుగు విధాల భక్తిపథాలను నిర్దేశించి ఆ శృంగాటకము మీద రుక్మిణిని అధిష్టింప జేసినాడు. ఇప్పుడు కనిపిస్తున్న రుక్మిణి బాలామణి మాత్రమే కాదు, మధురభక్తికి సకేతముగా నలిచిన మానినీశిరోమణి. "ఏనీ" అని ఎత్తుకుని నాలుగు పాదాల వరకూ నిర్వహించడములో ఉంది సగము అందము.

రుక్మిణి పంపిన సందేశములో ఇంకా ఇలావుంది:

**శా: ధన్యుస్ లోకమనోభిరాము గుల విద్యా రూప తారుణ్య సౌ**
**జన్య శ్రీ బలదాన శౌర్య కరుణా సంశోభితుస్ నిన్ను నే**
**కన్యల్ గోరరు కోరదే మును రమాకాంతాలలామంబు రా**
**జన్యాసేకపసింహ నావలననే జన్మించెనే మోహముల్**

రుక్మిణి శ్రీకృష్ణుడిని వలచింది ~ తాను వలచిన సంగతి సిగ్గు విడిచి పిలిచింది. అంతటితో ఊరుకోలేదు. తనకు కలిగిన మోహాన్ని ఒక చతురుడైన న్యాయవాదిలా సమర్థించడానికి పూనుకుంది. కృష్ణుని సకల సద్గుణాల పట్టిక నిచ్చింది. అబ్బబ్బ ఎన్ని గుణాలని! వంశం, విద్య, రూపము, యౌవనం, సంపద, శౌర్యము, దానము, దయ ~~ ఇన్ని గుణాలు కలబోసిన మూర్తిని ఏ కన్యలు కోరరు? అని ప్రశ్నించింది. నేను కోరుతున్నాను అంటే చాలదా? ఎందరెందరో కోరుతున్నారు కాబట్టే తాను కోరుతున్నదా? ఏమిటీ వాదం? అతడు లోకాభిరాముడు కాబట్టే అందరూ

కోరడము సహజమే! వలచే ఆ కోటొక్క వనితల పంక్తిలోనేనా తనకు స్థానం? కాదు తొల్లిటి లక్ష్మి తో తనకు సాజాత్యముంది. నాడు లక్ష్మి వలచింది ~ అతడు శ్రీపతి అయినాడు ~ నేడు తాను వలచింది. అతడు రుక్మిణీపతి కాక తప్పదు ~ ముందు  ముందు ఎందరో కన్యలకు కలిగిన వలపును ప్రస్తావించి  తరువాత ప్రత్యేకముగా లక్ష్మిని పేర్కొనడం రుక్మిణి చురుకుదనాన్ని సూచిస్తూంది. వెన్న దొంగను వెర్రి మొర్రిగా వలచిన బేల కాదు రుక్మిణి ~ తాను అతణ్ణి జన్మ జన్మలకు ప్రేమించే సర్వ స్వామ్యాలున్న సాక్షాత్ లక్ష్మీ స్వరూపిణి.  ఈ పద్యములో రాజన్యానేకపసింహ అనేది సాభిప్రాయ సంభోధనము.  రుక్మిణీ హరణములో రణము తప్పదు ~ మత్తెక్కిన రుక్మి, శిశుపాలుడు మొదలైన రాజులు మదపుటేనుగుల్లా ఎదురు తిరుగుతారు. శ్రీకృష్ణుడు వారిపాలిటి సింహమై విక్రమిస్తాడు ~ వారి గర్వాన్ని చేధిస్తాడు. ఇంతటి నిశ్చయం తనకుంది. అందుకే ఆమె సంభోధనలో జరుగనున్న కథ ధ్వనించింది.

**ఉ:  శ్రీయుత మూర్తి! యో పురుషసింహమ! సింహము పాలిసొమ్ము గో**
**మాయువు కోరు చందమున మత్తుడు చైద్యుడు నీ పదాంబుజ**
**ధ్యాయినియైన నన్ను వడిదా గొనిపోయెదనంచు నున్న వా**
**డాయథ మాధముం డెరుగడభుతమైన భవత్ప్రతాపముల్**

కృష్ణుణ్ణి పదే పదే శ్రీపతిగా సంభోదించనిదే రుక్మిణికి తృప్తి లేదు. తనకు తెలియకుండానే తానే లక్ష్మి ననే అభిప్రాయము ఆమె వాదనలో తొంగిచూస్తూంది. అతడు పురుషసింహుడు ~ అంటే పురుషోత్తముడు. పురుషులెందరున్నా పురుషోత్తముడొక్కడే! అతడు శ్రీమన్నారాయణుడు ~ *తాను అతని సొత్తు ~ తన జీవిత ధ్యేయము హరిచరణ కమల ధ్యానము. అలాంటి తనను తీసుకుని పోవాలనుకుంటున్నాడు శిశుపాలుడు ~వాడు మత్తుడు ~ వాడు మత్తత ఒంటికి సంభంధించినది* కాదు ~ ఊహకు సంభంధించినది. సింహము సొమ్మును గుంటనక్క కోరుకోవడము విపరీతము కాదు? శ్రీకృష్ణునికి అంకితమైన తనను శిశుపాలుడు వాంచించడము ఆ విపరీత బుద్ధి వల్లనే ~ వాడు అధముడే కాదు ~ అధమాధముడు. ఆ మాటలలో ఆ బాలామణి శక్తిస్వరూపిణిగా స్ఫురిస్తుంది. ఎక్కడినుంచీ వచ్చింది ఈమెకీ సత్తువ? కేవలం ఆ పరమాత్ముని పాదాంబుజ ధ్యానము వల్ల. శిశుపాలునిది కంటికీ ఒంటికీ పొరలు కప్పే తామస మార్గము ~ రుక్మిణిది కైవల్యమూర్తికి తనను తాను కానుకగా ఇచ్చుకున్న పరమ సాత్విక పథం.

రుక్మిణి సందేశములో ఇంకా ఇలా వుంది:

**అంకిలి సెప్పలేదు చతురంగ బలంబులతోడలెల్లి యో**
**పంకజనాభ నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివష్మున్ భవదీయ శౌర్యమే**
**యుంకువ సేసి కృష్ణ పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్**

పురుషోత్తమా! కృష్ణా! పంకజనాభా! నీవు రేపే చతురంగబలములతో గూడివచ్చి శిశుపాలుడు, జరాసంధుడు మున్నగు దుష్టులను జయించి నా కడకు వచ్చి నీ శౌర్యప్రతాపనులనే ఓలిగాజేసి రాక్షస వివాహ క్రమమున నన్ను  తీసుకుని పొమ్ము ~ నేను నీ వెంట వస్తాను ~ నిన్ను ఎవరూ అడ్డుకునజాలరు.

**లోపల సౌధంబులోన వర్తింపగ దేవచ్చునే నిన్ను దెత్తునేని**
**గావలివారల గల బంధువులజంపి కాని తేరాదని కమలనయన**
**భావించితేని నుపాయంబు సెప్పెదనాలింపు కులదేవయాత్ర జేసి**
**నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్క బెండ్లికి మునుపడ బెండ్లికూతు**

**నెలమి మావారు బంపుదురేనునట్లు పురము వెలువడి యేతెంచి భూతనాథు**
**సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత**

నీవు మహాసౌధంబులో ఎక్కడో ఉంటావు కదా ~ అక్కడ కావలి వారు కానీ మరెవరైనా యోధులు  నన్ను అడ్డుకున్నచో నేను వారిని చంపాలికదా అని నీవు భావిస్తే ~ కులదేవత యాత్ర మా ఆచారము ~

దానికి నగరము బయట ఉన్న గౌరి గుడికి వచ్చి మ్రొక్కులు చెల్లించే సమయములో నన్ను తీసుకుని పొమ్ము ప్రభూ!

ప్రాణేశ నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబుల కలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపగా లేని తనులత వలని సౌందర్యమేల
భువనమోహన నిన్ను బొడగానలేని చక్షురింద్రియముల సత్వమేల
దయిత నీయధరామృతంబానగా లేని జిహ్వాకు ఫల రస సిద్ధి యేల

నీరజాతనయన నీవనమాలికా గంధమబ్బలేని ఘ్రాణమేల
ధన్యచరిత నీకు దాస్యంబు సేయని జన్మమేల యెన్ని జన్మములకు

ప్రాణేశ్వరా! నీ మధురవచనములను వినెడి యోగమే లేకున్నచో ఈ చెవులుండీ వ్యర్థమే! నీ సుఖములకు ఉపయుక్తము కాకున్నచో కోమలనైన ఈ తను శోభలన్నియూ నిరుపయోగములే! నీ దర్శన భాగ్యము లేకున్నచో ఈ కన్నుల ఉనికికి అర్థమే లేదు! నీ అధరామృతాన్ని గ్రోలజాలకున్నచో ఈ నాలుక నిరర్థకము! నీ కంఠహారమైన వనమాలికయొక్క పరిమళమును ఆఘ్రాణింపకలేకున్నచో ఈ నాసిక ఉన్నా లేనట్లే! నిన్ను సేవింపజాలకున్నచో నా ఈ జన్మ వృథా! ఎన్ని జన్మలనెత్తియైననూ నిన్ను సేవించినవారే ధన్యులు.

ఇలా రుక్మిణి సందేశాన్ని విప్రోత్తముడు వివరించగా శ్రీకృష్ణుడేమన్నాడో .....

విధర్భ రాజధాని కుండినీ నగరములో ఎంతో కోలాహలముగా పురప్రజలుంటే వారికి బలరామ కృష్ణులు రుక్మిణి వివాహానికి వచ్చినారని వార్త తెలిసింది. వారందరూ రుక్మిణికి శ్రీకృష్ణుడు ఎంతో ఈడైనవాడు ~ అన్ని విధాల తగిన వాడని లోకమే మురిసిపోతుందని, ఇదే జరగితే మనందరి పుణ్యఫలని సంబరపడినారు. రుక్మిణీ దేవి అమ్మవారిని ప్రార్థిస్తూ....

**ఉ: నమ్మితి నా మనంబున సనాతనులైన యుమా మహేశులస్**
**మిమ్ము బురాణ దంపతుల మేలు భజింతు గదమ్మ మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి జేయుమమ్మ నిన్**
**నమ్మిన వారికెన్నడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ**

నిన్నటి తరమువరకూ తెలుగునాట కన్నెపిల్లలు భక్తి తాత్పర్యాలతో పాడుకున్న పద్యమిది. ఇందులో ఉన్న జీవ శక్తి ఆ భక్తి. మహేశ్వరుని అర్ధాంగియైన మహేశ్వరి దయా జలధి ~ కల్యాణ సంసిద్ధికి సేవధి. ఆ చల్లనితల్లికి రుక్మిణి ప్రత్యేకముగా ప్రణమిల్లినది. ఇందులో అమ్మను అమ్మ అమ్మ అని ఐదు సార్లు సంభోధించడము ఈ పద్యానికి ఇంత ప్రాచుర్యము రావడానికి ప్రధాన కారణము. అక్కడ బ్రాహ్మణ దంపతులు చాలా సంతోషముతో రుక్మిణికి శుభాలు కలగాలని

ఆశీర్వదించినారు. ఆ తరువాత రుక్మిణీదేవి మౌనముగా గుడినుండీ మెల్ల మెల్లగా బయలుదేరింది శ్రీకృష్ణుని రాకకై నిరీక్షించుచూ....

**మ: అళి నీలాలక బూర్ణ చంద్ర ముఖినేణాక్షిం బ్రవాళాధరం**
**గల కంఠిన్ నవ చ్పల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్త నిం**
**బులిన శ్రోణి నిభేంద్ర యాన నరుణాంభోజాత హస్తన్ మహో**
**త్పలగంధిన్ మృగరాజ మధ్య గని విభ్రాంతాత్ములైరందరున్**

అలా నెమ్మదిగా రుక్మిణీదేవి నడుస్తుంటే ఆమె వీర మోహిని కాక ఇంకేమనుకుంటారు? విభ్రాంతులైనారట ~ అంటే అక్కడున్న వారి మనస్సులే చెదరి పోయినాయన్న మాట! ముందు వారికి తుమ్మెద రెక్కల వంటి కురులు కనిపించినాయట! ఆ తరువాత చంద్రబింబమువంటి ముఖము కనిపించిందట! జింక కన్నులు ~ పగడాల పెదవి ~ కలకంఠం ~ పాదపల్లవాలు ~ కుచకుంభాలు ... ఇత్యాదులు ...ఏమిటీ క్రమము? ఇక్కడే పోతనామాత్యుల రచనా ప్రతిభ ~ సాధించిన ఔచిత్యము పరాకాష్టనందుకుంది. చూచేవారు విభ్రాంతులు ~ మతి చెదరినవారు ~ ఉన్మాదము ముదిరినవారు. ఆ జగన్మోహిని దుర్నిరీక్ష్య సౌందర్యాన్ని ఒక. క్రమములో చూడగలుగుతారా? ఈ దృష్టి ఉంది కనుకనే పోతన రెండు సాభిప్రాయ పదాలు ప్రయోగించినడు ~ ఆమె వీరమోహిని అనీ, వారు విభ్రాంతత్ములు అని.

అక్కడ చేరిన రాజపుంగవులు ఆమెను చూచి పరవశించి పోగా ~ ఆమె క్రీగంటి చూపులతో అందరినీ కలయచూస్తూ...జగన్మోహనాకారుడైన శ్రీకృష్ణుని చూచింది. అప్పుడు ఆ సుందరి కాముని బాణానికి లోనయ్యి స్వామివారి రథాన్ని ఎక్కబోయింది. స్వామివారు ఆ సుందరిని చూచి ఆమెను చేయిపట్టుకుని తన రథమునందు చేర్చుకున్నాడు అక్కడున్న వారందరూ చూస్తూ ఉండగా. స్వామివారు తన శంఖాన్ని పూరించుచూ ద్వారకానగరమార్గమున సాగిపోసాగెను. అప్పుడు అక్కడ ఉన్న భటులు, రాజాధిరాజులు వెంటాడి నిలువమని కేకలు వేస్తుండగా ~ ఆ సుందరి భయపడుచూ సిగ్గుతో శ్రీకృష్ణుని ముఖాన్ని చూడగా...

**క: చొచ్చెదరదె యదువీరులు, వ్రచ్చెదరి సేననెల్ల వైరులు పెలుచన్**
**నొచ్చెదరును విచ్చెదరును, జచ్చెదరును నేడు చూడు జలజాతాక్షీ**

అని స్వామి రుక్మిణిని ఊరడించినాడు.~శ్రీకృష్ణ బలరాముల సైన్యము వేసిన బాణాలను తప్పించుకుంటూ జరాసంధాదులు శిశుపాలుని చూచి ...

**ఆ: బ్రదుకవచ్చు నొడల బ్రాణంబులుండిన, బ్రదుకు గలిగెనేని భార్య గలదు.**
**బ్రదికితీవు భార్యపట్టు దయ్యమెరుంగు, వగవ వలదు చైద్య! వలదు వలదు**

ఈ శరీరములో ప్రాణములున్నచో ఎలాగైనా బ్రతుకవచ్చును ~ బ్రతికి ఉన్నచో భార్యను పొందవచ్చును ~ ఇప్పుడు నీవు బ్రతికియే ఉన్నావు చాలు ~ భార్య విషయము దేవుడ···

అలా రుక్మినీ శిశుపాలునీ సమాధానపరిచి వెను దిరిగి పోయారు జరాసందాదులు.. కానీ రుక్మి మాత్రమూ కృష్ణుడలా రాక్షస పద్ధతితో తన గారాల చెల్లిలిని తీసుకుపోవడము సహింపక తన సేనతో శ్రీకృష్ణుని వెంటాడుతూ వెళ్ళి ఇలా అన్నాడు శ్రీకృష్ణుడితో...

**మాసరివాడవా మా పాప గొనిపోవ; నేపాటిగలవాడ; వేది వంశ;**
**మెందు జన్మించితి; వెక్కడ బెరిగితి; వెయ్యది నడవడి; యెవ్వడెరుగు**
**మానహీనుడ వీవు; మర్యాద లెరుగవు; మాయగైకొని మలయరావు;**
**నిజరూపమున శతృనివహంబుపై బోవు వసుధేశుడవు గావు; వావి లేదు**

**కొమ్ము నిమ్ము నీవు గుణరహితుండవు; విడువు; విడువదేని విలయకాల**
**శిఖిశిఖా సమాన శితశిలీ ముఖముల గర్వమెల్ల గొందు గలహమందు**

రుక్మిణిని  ఎత్తుకుపోతున్న శ్రీకృష్ణుడిని అదలించి తూలనాడుతున్నాడు రుక్మి ఈ పద్యములో ~ అతని గుణాన్నీ పేరు పేరున ఎంచి దుయ్యబడుతున్నాడు. పైకి చూస్తే అన్నీ నిందలే ~ రుక్మి నిందలు తప్ప అభినందనలు చేసేవాడా మరి? ఒక దుష్ట పాత్ర విశిష్ట రక్షకుణ్ణి చెడా మడా తిడుతూ ఉంటే ~ పోతన ఈ పద్యములో ~ ఆ

దుష్టుడికి తెలియకుండానే వాడి పాడు నోట పరతత్త్వ రహస్యాలను పలికించాడు.  ఏమన్నాడేమిటి?

రుక్మికి సరివాడు కాదట కృష్ణుడు! నిజమే కదా ~ కృష్ణుడు అందరికీ అతీతుడు ~ అతడు ఏ పాటి గలవాడు? ముల్లోకాలు అతనివే కదా! ఆ సిరియే అతనిది కదా!  ఏది వంశం? విష్ణుమూర్తికి ఒక వంశమంటూ ఉంటుందా!  ఎందు జన్మించితివి? అతనికి జన్మ అంటూ లేదే!  ఎక్కడ పెతిగితివి? పెరుగుట విరుగుట నరులకే కదా! నారాయణుని కెక్కడిది! ఎయ్యది నడవడి? నడిపించేవాని నడవడు ఎవడెరుగును! మానహీనుడవు? అశరీరునికి, ఆత్మ స్థితునికి మానప్రసక్తి ఏది! మర్యాద లెరుగవు? అవును అనంతుడు అతడు, ఆయనే మనకు మర్యాదలు నేర్పుతాడు కదా! అనంతుడతడు!  మాయ గైకొనిగాని మలయరావు? సర్వమూ ఆతని మాయే కదా!  నిజరూపమున శత్రునివహంబుపై బోవు? అన్ని రూపాలు అతనివే కదా!
వసుదేవుడవు  కావు?  నిజమే! ఒక్క వసుధకే కాదు, చతుర్దశ భువనాలకే అధీశ్వరుడు! వావి లేదు? అవును త్రివిక్రమునికి క్రమముతో నిమిత్తము లేదు కదా! గుణ రహుతుండవు? అవును, గుణత్రయము జీవకోటికి,  గుణాతీతునికేటికి!

ఇలా పైన నిందలుగా కనిపించినా, లోన స్థుతిని దాచుకున్న పద్దతి. అలంకారాలలో వ్యాజ స్థుతి.

ఇలా నిందారోపణ రుక్మి చేయగా, శ్రీకృష్ణుడు నవ్వుచూ ఒక్క బాణముతో రుక్మి విల్లును విరిచి అతని శరీరాన శరములను నాటినాడు. ఎనిమిది శరాలతో అతని రథాశ్వాలను కూల్చెను~ సారథిని చంపినాడు. రుక్మి తీసుకున్న ధనుస్సులనూ, శూలములనూ తదితరాలనూ ఖండించినాడు కృష్ణుడు. రుక్మి అంతటితో ఆగక కత్తిని చేబూని ఎగురగా శ్రీకృష్ణుడు అతని కత్తినీ కవచాన్ని నుగ్గు నుగ్గు చేసి ఒక ఖడ్గాన్ని చేబట్టి జళిపించి వాని శిరస్సు ఖండించుటకు సిద్ధపడుతుండగా రుక్మిణి అడ్డము వచ్చి స్వామిపాదాలపై పడి....

**నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపగలేక యో**
**సన్నుతామర కీర్తి శోభిత సర్వ లోక శరణ్య మా**
**యన్న యీతడు నేడు చేసె మహాపరాధము నీ యెడన్**
**నన్ను మన్నన సేసికావు మనాథనాథ దయానిధీ**

**కల్లలేదని విన్నవించుట గాదు వల్లభ యీతనిన్**
**బ్రల్లదుం దగ జూచితేనియు భాగ్యవంతులమైత్తిమే**
**మల్లుడయ్యె ముముందు డీశ్వరుడంచు మోదితులైన మా**
**తల్లిదండ్రులు పుత్రశోకము దాల్చి చిక్కుదురీశ్వరా**

ప్రభూ! నీవు దేవదేవుడవైన శ్రీమన్నారాయణుడని తెలుసుకొనలేక మా అన్న నీయెడ నేడు అపరాధాన్ని చేసినాడు. నా

మీది అనుగ్రహముతో మా అన్నను క్షమింపుడు రక్షింపుడు. మా అన్న దుష్టుడే. మీరు అల్లుడైనారని నా తల్లిదండ్రులు ఎంతో సంబర పడుతున్నారు ~ మా అన్నను చంపితే వారు పుత్రశోకానికి కుమిలిపోతారు ~ దయతో మా అన్నను విడిచిపెట్టుమా స్వామీ? అప్పుడు రుక్మిణి మాట విని ~ బావా! రుక్మి  అని రుక్మిని  పట్టి బందించి గడ్డమును, మీసాలనూ, తల శిరోజాలనూ అక్…

అలా రుక్మిణిని సమాధానపరచిన తరువాత, రుక్మి బలరాముని హితోక్తులచే వాస్తవమును గ్రహించి,  తనకు కలిగిన విరూప స్థితికి వగచుచూ ~ శ్రీకృష్ణుని జయించిన తరువాతనే నేను కుండిన నగరములో కాలు పెడుతాను ~ అని ప్రతిన చేసి నగరానికి బయటనే ఉండిపోయి నాడు.

**రాజీవ లోచనుడు హరి, రాజసమూహముల గెలిచి రాజసమొప్పన్**
**రాజిత యగు తన పురికిని, రాజానన దెచ్చె బంధురాజి నుతింపన్**

శ్రీకృష్ణుడు వైభవోపేతముగా రుక్మిణిని తీసుకుని చక్కగా అలంకృతమైయున్న ద్వారకానగరానికి వచ్చినాడు ~ బంధుమిత్రుల ప్రశంసలనందుకుంటూ.

**ధృవకీర్తిన్ హరి పెండ్లియాడె  నిజ చేతోహారిణిన్ మానసై**

**భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం**

**ధవ సత్కారిణి బుణ్యచారిణి మహా దారిద్ర్య సంహారిణిన్**

**సువిభూషాంబర ధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్**

ఆ  శుభవేళ శ్రీకృష్ణుడు గుణవతులలో మేలుబంతి అయిన రుక్మిణిని పెండ్లి చేసుకున్నాడు. అంత్యప్రాసల దొంతరతో పోతనామాత్యుడు చేసిన కావ్య గానమిది.

అతడు హరి ~ ఆమె చేతోహారిణి. ఈ జన్మలోనే కాదు అతని హృదయాన్ని  హరించినది ~ ఆనాడే సంపత్కారిణిగా, ఇందిరా సుందరిగా అతనిని చేపట్టిన నాడే. ఆ దంపతులే ఈ దంపతులు.~ ఆ నాటి క్షీరసాగర తీర ము లో జరిగింది. రుక్మిణీ కృష్ణుల కల్యాణము అఖిల భువన కల్యాణము.

**సతులుందారును బౌరులు హితమతి గానికలు దెచ్చి యిచ్చిరి కరుణో**

**న్నత వర్ధిష్ణులకును మా, నితరోచిష్ణులకు రుక్మిణీ కృష్ణులకున్**

కృపాన్వితులై ఖ్యాతివహించినవారునూ, మహోన్నత తేజోమూర్తులునూ అయిన రుక్మిణీకృష్ణులకు వారి వివాహ మహోత్సవ సందర్భమున ఏతెంచిన పౌరులు దంపతులుగా ఆత్మీయతతో కానుకలను సమర్పించినారు.

**హరియీతెరగున రుక్మిణి, నరుదుగ గొనివచ్చి పెండ్లియాడుట విని దు**
**ష్కర కృత్యమనుచు వెరగందిరి రాజులు రాజసతులు దిక్కులనెల్లన్**

**అనఘ యాదిలక్ష్మియైన రుక్మిణితోడ గ్రీడ సలుపుచున్న కృష్ణు జూచి**
**పట్టణంబులోని ప్రజలుల్లసిల్లిరి, ప్రీతులగుచు ముక్తభీతులగుచు**

**కువలయ రక్షా తత్పర! కువలయ దళ నీలవర్ణ కోమల దేహా!**
**కువలయ నాథ శిరోమణి! కువలయ జన వినుత విమల గుణ సంఘాతా!**

**సేరసిజ నిభ హస్తా! సర్వ లోక ప్రహస్తా! నిరుపమ శుభ మూర్తీ! నిర్మల**
**రూఢకీర్తీ**
**పరహృదయ విదారీ! భక్త లోకోపకారీ! గురుబుధజన తోషీ!**
**ఘోరదైతేయశోషీ,**

ఈ కల్యాణానికి పెక్కుమంది రాజులు, మహారాజులు, కేకయ రాజు, కురునృపతి, సృంజయప్రభువు, యాదవేంద్రులు, విధర్భదేశాధిపతులూ, కుంతిభోజుడూ వచ్చినారు. కృష్ణుడు ఈ విధముగా పెండ్లియాడుట ఒక అపూర్వమైన విషయము అని ప్రశంసించినారు.

శుకయోగీంద్రుడు పరీక్షిన్మగారాజునకు రుక్మిణీ కృష్ణుల కల్యాణ కథను ఇలా వినిపించెను.

దేవా! నీవు ఈ భూమండలమును రక్షించుటలో నిరతుడవు ~ నల్ల కలువ రేకులవలె నీ దేహము కోమలము ~ నీలవర్ణశోభితము ~ అని వేనోళ్ళ కొనియాడుచుందురు.

స్వామీ! నీ కరములు కమలములవలె మనోహరములు ~ నీవు సకల లోకముల యందునూ విఖ్యాతుడవు. నీ రూపవైభవములు నిరుపమానములు. నీ కీర్తిప్రతిష్టలు స్వచ్ఛములు ~ చిరస్థిరములైనవి. నీ పేరు విన్నంతమాత్రమే శతృవుల హృదయాలు హడలెత్తుచుండును. భక్తుల యోగ క్షేమాలు అరయుటలో సాటిలేనివాడవు. నీ దర్శనమున అంద్రునూ సంతోషిస్తున్నారు. లోకకంటకులైన రాక్షసులను నిర్మూలించి, సాధుజనులను రక్షించి ధర్మమును ఉద్ధరించిన పరమాత్ముడవు నీవు ~ అని కొనియాడినారు ఆ కల్యాణానికి వచ్చిన పౌరులందరూ.

ఇంతటితో పోతనామాత్యుల శ్రీమన్మహాభాగవతములోని దశమ స్కందము లోని రుక్మిణీ కృష్ణుల కల్యాణ ఘట్ట పద్యాల, వివరణల వ్యాఖ్యలు సమాప్తము.శుభం భూయాత్.

**దామోదరాయ విధ్మహే వాసుదేవాయ ధీమహీ**

**తన్నో కృష్ణ ప్రచోదయాత్**

***